క్లుప్తంగా

చంద్రయాన్-3 నమూనా తయారీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎంపీఎల్ యూపీ స్కూల్ విద్యార్థులు బుధవారం చంద్రయాన్-3 నమూనాను, రాకెట్, రైలు ఇంజిన్‌ను తయారు చేశారు. హెచ్‌ఎం జయంతి మాట్లాడుతూ..తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాన్‌వెస్లీ, చార్లెస్ వెస్లీ, ఏంజెల్ బ్లెస్సీలు చంద్రయాన్-3 నమూనాను తయారు చేయటం అభినందనీయమన్నారు. విద్యార్థులు మరెన్నో కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాళ్లు సుగుణ, నిర్మలమ్మ, షబానా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిమిత్తం ప్రభుత్వం వంట పాత్రలను మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం మండలంలోని 31 పాఠశాలలకు సంబంధించిన స్టీల్ పాత్రలు, బేసిన్లు, హస్తాల గంటెలు, తదితర సామగ్రి ఎమ్మార్సీ కార్యాలయానికి చేరాయి. ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లోని వంట ఏజెన్సీ నిర్వాహకులకు ప్రజా ప్రతినిధుల ద్వారా పాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు



ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ గంగాధరరావు

నంద్యాలటౌన్: నంద్యాల ఆర్టీసీ డిపోలో 2023 ఆగస్టు నెలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఉద్యోగులను డిపో మేనేజర్ గంగాధరరావు అభినందించారు. బుధవారం డిపో ఆవరణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన కండెక్టర్లు రాజు, శేషన్న, చంద్రుడు, మల్లికార్జున, శివగోపాల్, డ్రైవర్లు వలి, బాషా, రాముడు, జీ.రెడ్డి, నాగన్నలను సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సర్వీసుల్లో సమయ పాలన పాటించి కిలో మీటరుకు ఎక్కువ ఆదాయము తీసుకు వచ్చి సంస్థకు ఉన్నతికి కృషి చేస్తున్న కండెక్టర్లు, డ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు మద్దిలేటినాయుడు, స్టేషన్ మేనేజర్ యం.బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎస్ఐ ఆవిర్భావ దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని హోలీక్రాస్ క్యాథడ్రల్ పాస్టరేట్-1, ఆల్‌సెయింట్ చర్చ్-2 ఆలయంలో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా సీఎస్ఐ జెండాను డీనరీ చైర్మన్లు జోసఫ్ బాబు, ఇమ్మాన్యుయల్ బాబు ఆవిష్కరించారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టరేట్-1 కార్యదర్శి స్టీఫెన్, పాస్టరేట్-2 కార్యదర్శి కిరణ్‌కుమార్, బాలయ్య, ప్రభుదాసు, గురువులు పాల్గొన్నారు.

దొర్నిపాడులో వర్షం

దొర్నిపాడు: మండలంలో బుధవారం తెల్లవారుజామునుంచి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అలాగే పొలాల్లో నీరు పారడంతో క్రాసింగ్ పనులకు కూలీలు విరామమిచ్చారు. 30.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ జయప్రసాద్ తెలిపారు.

32 శాతం సర్వే పూర్తి

ఉయ్యాలవాడ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలో 32 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేశామన్నారు. బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అల్లూరు గ్రామ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

దొర్నిపాడు: సచివాలయ ఉద్యోగులు అంకితాభావంతో పనిచేయాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని క్రిష్టిపాడు సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను ఆరాతీశారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను తీరును వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆళ్లగడ్డ:మండలంలోని ఆర్.క్రిష్ణాపురం-బాచేపల్లి గ్రామల మధ్యలో ఉన్న కొండతిప్పల్లో పేకాట ఆడుతున్న స్థావరాలపై రూరల్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాలు.. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 14 మందికి గాను ప్రతాప్, మాబాషా అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, 12 మంది పరారీలో ఉన్నట్లు చెప్పారు. పట్టుబడిన వారి నుంచి రూ.30వేల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

- పంచాయతీ, మండల పరిషత్, ఎమ్మెల్యే నిధులతో కోటపాడులో పనులు
- గ్రామంలో 95 శాతం సీసీ రోడ్లు
- చివరి దశలో సచివాలయం, ఆర్బీకే భవన నిర్మాణాలు



నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం



కొనసాగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

శిరివెళ్ల: మండలంలోని కోటపాడు గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంచాయతీ నిధులు, ఎమ్మెల్యే, మండల పరిషత్ నిధులతో వివిధ పనులు చేపట్టారు. పంచాయతీలో ఇప్పటికే 95 శాతం సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయి. పాత, కొత్త బీసీ కాలనీల్లో వంద శాతం సిమెంట్ రోడ్లు వేశారు. తాజాగా రూ. 42 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ. 16 లక్షలతో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు చేపట్టగా.. 80 శాతంగా పైగా పూర్తయ్యాయి.

జరిగిన అభివృద్ధి పనులు..

- కొత్త బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో రూ. 15 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణాలు
- మనబడి నాడు- నేడు కింద రూ. 10.30 లక్షలతో ప్రాథమిక పాఠశాల రూపు రేఖలు మారాయి.
- దశాబ్దాల పాటు ప్రహరి గోడకు నోచుకోని రూ. 18 లక్షల ఉపాధి పథకం నిధులతో పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం పూర్తియింది.
- రూ.25 లక్షల దేవదాయ ధర్మదాయ శాఖ నిధులతో శ్రీ చెన్నకేశవ, వీరభద్ర స్వామి ఆలయాల అభివృద్ధి జరిగింది. - గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద సచివాలయంకు రూ. 12 లక్షలు కేటాయించగా రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మరో రూ. 8 లక్షలతో గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలలో పోయే విద్యుత్ పెద్ద లైన్ మార్పిడికి సన్నాహాలు జరుగుతున్నాయి.

పాఠశాలలో మౌలిక వసతులు సమకూరాయి



మన బడి నాడు- నేడు కింద ప్రాథమిక పాఠశాలకు మౌలిక వసతులు వచ్చాయి. పాఠశాల పై కప్పు దెబ్బతిని వానా కాలంలో కారేది. నాడు నేడు నిధులతో మరమ్మతులు చేశాం. విద్యుత్ సదుపాయం, మరుగు దొడ్లు నిర్మించాం. పాఠశాలకు కాంపౌండ్ లేక ఇబ్బంది పడ్డాం. గోడ రావడంతో ప్రాంగణంలోని చెట్లకు రక్షణ కలిగింది. ఇప్పుడు పాఠశాల ఆహ్లాదకరంగా మారిపోయింది.

-గోపాల్, హెచ్‌ఎం

అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి



మా పంచాయతీలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలో కొత్తగా ఉన్న కాలనీలు, ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు ఉన్నాయి. కొత్తగా మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టాం. ప్రస్తుతం గ్రామ సచివాలయం పంచాయతీ కార్యాలయం, రైతు భరోసా కేంద్రం అద్దెభవనంలో ఉంది. వాటికి కొత్త భవనాల నిర్మాణాలు చురుకుగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి సహకారంతో గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోంది.

- దూదేకుల ఉశేనిబీ, సర్పంచు

ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాస్

చాగలమర్రి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గ్రామాల్లో 2 కిలోమీటర్ల లోపు ఓటర్లకు అనుకూలంగా పోలీంగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నంద్యాల ఆర్‌డీఓ, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలు, మండల పరిషత్ ప్రధాన ప్రాథమిక పాఠశాల, ముత్యాలపాడులోని ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలోని పోలీంగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండల పరిషత్ ప్రధాన ప్రాథమిక పాఠశాల (ఉర్దూ) భవనం శిథిలావస్థలో ఉండటంతో ఇక్కడ ఉన్న పోలింగ్ కేంద్రాన్ని సమీపంలోని పంచాయతీ కార్యాలయ భవనానికి, డి.వనిపెంట గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో ఈ పోలింగ్ కేంద్రాన్ని సమీపంలోని సచివాలయ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. మండలంలో ఓట్ల సర్వే కార్యక్రమం ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. హెచ్ ఎం కొటయ్య, బీఎల్‌ఓలు ధరణి, ప్రసన్న, పర్వీన్, నరేష్, విశ్వనాథ్, తదితరులున్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నర్సిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ఉయ్యాలవాడ : ప్రభుత్వం ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లో అందించే వైద్య సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రమేష్ చంద్రబాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని నర్సిపల్లె గ్రామంలో ప్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 65 మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మధ్యాహ్నం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సాయంత్రం బయటకు రాలేక అనారోగ్యంతో ఇంటి వద్దనే బాధపడుతున్న వారికి గృహాల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు దస్తగిరి, ప్రమీలమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.కోటయ్య బుధవారం తెలిపారు. అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థులు ఎస్.ఎమ్‌డీ అమన్, పి.సుమేరా, అండర్-14 విభాగంలో పి.పండు ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఈ నెల 25న కర్నూలు పట్టణంలోని బి.క్యాంపు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారన్నారు. ఎంపికైన విద్యార్థులను, పీటీటీలు ముల్లా.దాదాపీర్, భారతీలను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సబ్సిడీ శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు: సబ్సిడీ శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వప్నికా రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ...రబీ సీజన్‌లో రైతులకు శనగ విత్తనాలను సబ్సిడీ కింద అందజేసేందుకు ప్రభుత్వం విత్తనాలను మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా జేజీ-11 శనగ రకం మండలానికి 350 క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో క్వింటా రూ.4860 తో అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే కంటి న్‌జెన్సీ కింద జొన్న లైలా రకం 30 క్వింటాళ్లు మంజూరయ్యాయని, 80 శాతం సబ్సిడీతో క్వింటా రూ.4400 కు అందజేయనున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.

రైతులు జీవన ఎరువులు వాడాలి



జీవామృతం తయారీ విధానం పై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గోస్పాడు: రైతులు ప్రకృతి వ్యవసాయంలో జీవన ఎరువులు వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ధనలక్ష్మి, బాలరాజు అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో దేశవాళీ రకాలు సాగు చేస్తున్న రైతు మద్దిలేటి పొలాన్ని పరిశీలించారు. సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి మాట్లాడుతూ భూమిలో ఉన్న సూక్ష్మ జీవులను వృద్ధి చెందించి పంటల సంరక్షణకు తోడ్పడాలన్నారు. రైతులు అధిక శాతం రసాయన ఎరువులు వాడటం వలన ఆర్థికంగా భారం అవుతుండటంతో పాటు పంట పొలాలు భూసారాన్ని కోల్పోతాయని తెలిపారు. అంతేకాకుండా విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడటం వల్ల ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుందని, వాతావరణం సమతుల్యత దెబ్బతింటుందని చెప్పారు. సస్యరక్షణ శాస్త్రవేత్త బాలరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ రకాల పంటలను అనుసరించి ఆదాయం సమకూర్చుకోవాలని తెలిపారు. చీడపీడల నివారణకు బ్యాక్టీరియా తయారు చేసి అందజేస్తున్నామని, రైతులు వారి అవసరాల మేరకు కల్చర్ తయారు చేసుకుని పంటల పై పిచికారీ చేయాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



పద్మావతి నగర్‌లోని ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ నాగశివలీల

నంద్యాల(సిటీ): మహిళలు ఆర్థికంగా ఎదగాలని మెప్మా ఉమ్మడి (కర్నూలు, నంద్యాల) జిల్లా పీడీ నాగశివ లీల అన్నారు. బుధవారం మున్సిపాలిటీలో పలు కార్యక్రమాల పై మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తే వారితో పాటు వారి కుటుంబ పరిస్థితి మారిపోతుందన్నారు. ప్రభుత్వం మెప్మా ద్వారా పలు రకాలుగా మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక చేయూత అందిస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పట్టణ మెప్మా కార్యాలయంలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాల పై సభ్యులకు అవగాహనా సదస్సు నిర్వహించి, బాలింతలు రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర ఆరోగ్య నియమాలను వివరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్, పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను సందర్శించి వ్యాపార అభివృద్ధికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఆమె వెంట మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి, సీఓలు తదితరులు ఉన్నారు.

బేకరీలో చోరీ

బొమ్మలసత్రం: పట్టణ శివారులోని రైతునగరం గ్రామ సమీపంలో శివసాయి బేకరీలో బుధవారం వేకువజామున గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బేకరి యజమాని నాగప్రసాద్ తెలిపిన వివరాల మేరకు మంగళవారం రాత్రి యథావిధిగా బేకరి దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం తెరిచేందుకు వచ్చి చూడగా తాళాలు పగులగొట్టినట్లు గుర్తించాడు. దుకాణంలోకి వెళ్లి చూడగా బాదంపప్పు, సిగరెట్ బాక్సులు, జీడిపప్పు తదితర వస్తువులు కనిపించలేదు. వీటి విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు చెబుతున్నాడు. యజమాని ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 29న ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ ఏపీ రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... అండర్-17, 14 బాల బాలికల ఎంపికను నంద్యాల నూనెపల్లె మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ 09 ఈవెంట్స్‌లలో ఎంపిక నిర్వహిస్తారన్నారు. మండల కో ఆర్డినేటర్లు మండల టీంలను ఎంపిక నిర్వహించే రోజున 9 గంటలకే క్రీడా మైదానానికి హాజరు పర్చాలన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు.

30 నుంచి శౌర్య జాగరణ యాత్ర

శిరివెళ్ల: ఈ నెల 30వ తేదీ నుంచి జిల్లాలో శౌర్య జాగరణ యాత్ర ప్రారంభమవుతుందని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వైవీ రామయ్య తెలిపారు. బుధవారం గోవిందపల్లెలో యాత్రకు చెందిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతు 30వ తేదీన అహోబిలంలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. రుద్రవరం, యర్రగుంట్ల, శిరివెళ్ల, గాజులపల్లె, మహనంది, పాణ్యంలలో యాత్ర కొనసాగుతుందని, అక్టోబర్ 14న నంద్యాలలో యాత్ర ముగుస్తుందన్నారు. యాత్రలో భాగంగా 11వ తేదీన గోవిందపల్లెలో బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పరిషత్ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు పార్వతీశం, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం

నంద్యాలటౌన్: అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో అవయవదానం పట్ల అవగాహన కల్పించే బాధ్యత వైద్యులదేనన్నారు. ఒక వ్యక్తికి అవయవదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. మానవతా విలువలతో కూడిన వైద్య సేవలు అందించడమే వైద్యుని ముఖ్య కర్తవ్యమన్నారు. అనంతరం అవయవదానం పై ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పది కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నంద్యాల(అర్బన్): రేషనలైజేషన్ కింద నంద్యాల నియోజకవర్గంలో పది కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఎన్నికల నిర్వహణాధికారిని అనురాధ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల మార్పులు, చేర్పులు, సవరణలపై పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 27న ఓటర్ జాబితాకు సంబంధించిన డ్రాఫ్ట్ విడుదల చేస్తామన్నారు. అందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ శ్రీనివాసులు, ఎస్ఏ చంద్రనాయక్, నాయకులు అనిల్ అమృతరాజు, శివరాంరెడ్డి, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికి వైద్యసేవలందించాలి



జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తికి ఆరోగ్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణ బాబులు అన్ని జిల్లాల కలెక్టర్‌లకు సూచించారు. బుధవారం రాత్రి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన గైడ్‌లైన్స్ ప్రకారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని వైద్యాధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



5వ వార్డులో సీసీ డ్రైన్లకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలో ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో అభివృద్ధి పనులకు భూమి పూజలు చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. బుధవారం స్థానిక 5వ వార్డులో రూ.35లక్షలతో డ్రైనేజీల నిర్మాణానికి వార్డు కౌన్సిలర్ ఆరిఫ్‌నాయక్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దేందుకు ఏదో ఒక ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్నా టీడీపీ నాయలకులకు అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పట్టణంలో మునుపెన్నడూ లేని రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంఈ రమణమూర్తి, డీఈఈలు మధుకుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే



పెద్దవంగలి గ్రామంలో రక్త నమూనాను సేకరిస్తున్న ఏఎన్‌ఎం భూదేవి

చాగలమర్రి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మండలంలో చేపట్టిన సర్వే వారం రోజులుగా నిర్విరామంగా కొనసాగుతోంది. మండలంలోని 8 గ్రామాలలో వైద్య సిబ్బంది సీహెచ్‌ఓ, ఎఎన్‌ఎంలు ప్రభుత్వం సూచించిన 7 రకాల రక్త పరీక్షలను నిర్వహిస్తూ వాటి ఫలితాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వైద్యాధికారి షేక్.ఇమ్రాన్ తెలిపారు.

రుద్రవరం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను సక్రమంగా చేయాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి సూచించారు. బుధవారం నర్సాపురంలో సాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు.

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లాలో ఇదివరకే ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని 22వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అనిల్ అమృతరాజ్ అన్నారు. బుధవారం స్థానిక 22వ వార్డులో నిర్వహించిన ఆరోగ్య సర్వే కార్యక్రమంలో హాజరయ్యారు.

అలరించిన విద్యార్థుల వేషధారణలు



నర్సాపురంలో వివిధ వేషధారణలో విద్యార్థులు

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలతో అలరించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా పాఠశాలలో బుధవారం మేరా దేశ్ మేరా మట్టి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు ఉద్యమ వీరుల వేషాలు ధరించి, జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు మల్లికార్జున, రాజు, గోవిందరాజు తదితరులు ఉన్నారు.

పీహెచ్‌డీ అధ్యాపకులకు సన్మానం



పీహెచ్‌డీ అవార్డు పొందిన శశికళను సన్మానిస్తున్న అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): పీహెచ్‌డీ అవార్డులు పొందిన పట్టణంలోని పీఎస్‌సీ-కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు బుధవారం కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ...అర్థశాస్త్ర విభాగాధిపతి నాగేంద్రకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు రూకల శశికళకు రాయలసీమ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ అవార్డులు ప్రదానం చేశాయన్నారు. స్టాఫ్‌క్లబ్ చైర్మన్ డా.పి.వెంకటేశ్వర్లు, కల్చరల్ క్లబ్ అధ్యక్షుడు డా.రామలింగారెడ్డి పాల్గొన్నారు.

అహోబిలం దేవస్థానం ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అహోబిలం దేవస్థానం ఫొటోగ్రాఫర్ ప్రసాద్

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం దేవస్థానం ఆస్థాన ఫొటోగ్రాఫర్ ప్రసాద్ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చలర్ కమిషన్, ఫోటోగ్రఫీ కౌన్సిల్ విజయవాడలో నిర్వహించిన ఫోటో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శితమైన ప్రసాద్ తీసిన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం చిత్రాన్ని పురస్కారానికి ఎంపిక చేశారు. దీంతో విజయవాడలో బుధవారం ఫోటోగ్రఫి ఆకాడమి ఆఫ్ ఇండియా వారి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారంతో పాటు బంగారు పతకం అందుకున్నారు.

సంక్షిప్తం

వ్యక్తిపై దాడి

దొర్నిపాడు: మురుగు కాల్వ విషయంలో మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తిపై నడిపి సంజన్న, పెద్దసంజన్న దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు.

వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ చార్జీలు తగ్గించాలని, రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న, పుల్లా నరసింహులు మాట్లాడుతూ...కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల్లో భాగంగా విద్యుత్ చార్జీలపై ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడమే కాకుండా, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను బిగించి రైతులను ఇబ్బంది పెడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట మద్దులు, గౌస్, బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

నంద్యాల(అర్బన్): బేడ, బుడగజంగాలను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేయడం పట్ల నంద్యాల జిల్లా బుడగజంగాల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు జమ్మన్న ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కాలనీలో కమిటీమెంబర్లు, సంఘ పెద్దలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జమ్మన్న మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బేడ, బుడగ జంగాల కులాలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు లేక చిన్నారులు చదువులకు దూరమయ్యారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని పనిని జగనన్న చేయడం పట్ల జీవితాంతం మా కులాలు ఆయనకు రుణపడి ఉంటామన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ : అప్పుల బాధతో మనస్తాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ నరసింహులు బుధవారం తెలిపారు. రూరల్ మండలం పేరాయిపల్లె గ్రామానికి చెందిన డాలు కుమార్ కౌలుకు పొలాలు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పెట్టుబడులకు అధికంగా అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పు ఇచ్చిన వారు చెల్లించాలని ఒత్తిడి చేస్తుండటంతో కొంతకాలంగా కుటుంబ సభ్యులకు చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న కుమార్‌ను స్థానిక వైద్యశాలకు తరలించి, మెరుగైన చికిత్స కోసం కర్నూలు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలులేక మృతి చెందాడు. భార్య రోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దొర్నిపాడు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నపాఠశాలకు చెందిన విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈనెల 25న కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-14, 17 విభాగంలో ఉషారాణి, ప్రసాద్, మహ్మద్‌హుసేన్, కుష్మాబీలు ప్రతిభ చూపినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో పాటు పీడీ దేవేంద్రను అభినందిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గద్దం చెన్నయ్య, విజయలక్ష్మి, రమణయ్య, నాగరాజు, మౌళాలి, బాలకోటిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.